క్లుప్తంగా

మధ్యాహ్న భోజనం తనిఖీ

తెర్లాం: మండలంలోని గొలుగువలస గ్రామ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను ఎంఈవో జె.త్రినాధరావు శుక్రవారం సందర్శించి, అక్కడి విద్యార్థుల కోసం సిద్ధం చేసిన మధ్యాహ్న భోజనం తనిఖీ చేశారు. మెనూ ప్రకారం వంటలు చేశారా లేదా వంటకాలు రుచికరంగా ఉన్నాయా లేదా అని పరిశీలించి, పలు సూచనలు చేశారు. విద్యార్థులకు రుచి, శుచితో కూడి భోజనం వండిపెట్టాలని తెలిపారు. మెనూ ప్రకారం భోజనాలు వండి వడ్డించాలన్నారు. అంతకుముందు విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు, పాఠశాల రికార్డులు, విద్యార్థుల చేతిరాత పుస్తకాలు, హోమ్‌వర్క్ పుస్తకాలు, అభ్యసన సామర్థ్యాలు పరిశీలించారు. మరుగుదొడ్ల నిర్వహణ సక్రమంగా ఉండాలని స్కావెంజర్స్‌కు సూచించారు.

రాజాం సిటీ: మండలంలోని మొగిలివలస ఎంపీపీ పాఠశాలను ఎంఈవో వై.దుర్గారావు శుక్రవారం సందర్శించి, మధ్యాహ్న భోజనం వంటకాలను రుచి చూసి పరిశీలించారు. రుచి, శుచితో కూడిన భోజనం అందివ్వాలని, కాచిచల్లార్చిన నీటిని అందుబాటులో ఉంచాలన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

భూ సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు


బాడంగి: మాట్లాడుతున్న తహసీల్దారు సుధాకర్

బాడంగి/రేగిడి/రాజాం: మండలాల్లోని పలు గ్రామాల్లో శుక్రవారం రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన తహసీల్దార్లు సహా ఇతర రెవెన్యూ సిబ్బంది అంతా రైతులు భూ సమస్యల పరిష్కారానికి సమర్పించిన అర్జీలు స్వీకరించి, పరిశీలించారు. భూ సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు నిర్వహించడం జరుగుతోందని, త్వరితగతిన సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు.

బుచ్చిఅప్పారావు పేరు కొనసాగించడం అభినందనీయం


బుచ్చిఅప్పారావు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కొప్పుల వెలమ సంఘ నాయకులు

బొబ్బిలి: తాటిపూడి జలాశయానికి గొర్రిపాటి బుచ్చిఅప్పారావు పేరు కొనసాగించడం అభినందనీయమని కొప్పుల వెలమ సేవా సంఘం నాయకులు అన్నారు. శుక్రవారం స్థానిక పట్టణంలోని కొప్పుల వెలమ కల్యాణ మండపంలో బుచ్చిఅప్పారావు చిత్రపటానికి పూలమాల వేసి, నివాళులర్పించారు. అనంతరం ఆయన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో సంఘ అధ్యక్షుడు ఎల్.జగన్నాథం, చినఅప్పలస్వామి తదితరులు పాల్గొన్నారు.

'ఉపాధి' వేతనం రూ.300కు పెంచుతాం

బొబ్బిలిరూరల్: ఉపాధి హామీ పథకం వేతనదారులకు ప్రస్తుతం ఇస్తున్న రూ.270 వేతనాన్ని రూ.300కు పెంచేందుకు చర్యలు చేపట్టామని డ్వామా పీడీ ఎస్.శారదాదేవి అన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో బొబ్బిలి నియోజకవర్గంలోని బాడంగి, రామభద్రపురం, తెర్లాం, బొబ్బిలి మండలాల టెక్నికల్ అసిస్టెంట్లతో శుక్రవారం సమావేశమైన ఆమె.. ఉపాధి హామీ పథకం పనుల్లో చెరువులు, గోకులాల అభివృద్ధికి అధిక ప్రాధాన్యమిస్తున్నామన్నారు. పల్లెపండగ పనుల్లో కాలువలు, రోడ్ల నిర్మాణాలకు సంబంధించి, 1092 పనులకు ఆమోదించగా, ఇప్పటివరకు 40 శాతం పనులు పూర్తి చేశామన్నారు. సంక్రాంతి నాటికి 70 శాతం పనుల పూర్తికి చర్యలు తీసుకుంటున్నామన్నారు.

అధ్వానంగా ఉంగరాడమెట్ట రోడ్డు


గుంతలమయమైన ఉంగరాడమెట్ట రోడ్డు

రేగిడి: మండలంలోని పాలకొండ–రాజాం ప్రధాన రోడ్డుకు ఆనుకుని ఉన్న ఉంగరాడమెట్ట రోడ్డు అధ్వానంగా తయారైంది. గతంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఇదే రోడ్డులో కొత్తగా బీటీ రోడ్డు నిర్మాణం చేసింది. అయితే కొంతమంది వ్యాపారులు రోడ్డుపైనే వాడుకనీరు వదిలేయడంతో పాటు భారీ వాహనాలు తిరగడంతో రోడ్డంతా గోతులమయమైంది. దీంతో అటువైపుగా వెళ్లే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి, కనీసం రోడ్డు మరమ్మతులైనా చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

సంతాప సభ

రాజాం: మండలంలోని ఆగూరు ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో శుక్రవారం సంతాప సభ ఏర్పాటు చేసి, నులకజోడు గౌరి మృతికి నివాళులర్పించారు. ఈ నెల 2వ తేదీన విధులు ముగించుకుని ఇంటికి వెళ్తుండగా, వీరఘట్టం వద్ద తీవ్ర అనారోగ్యానికి గురై, ఆమె మృతి చెందారన్నారు. ఆమె మృతికి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

- తమ నేతల జేబులు నింపడమే పనిగా కూటమి చర్యలు
- ఇష్టానుసారంగా ఎంఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధుల కేటాయింపు
- అవసరం లేనిచోట అధికంగా పనులు
- గతంలో వేసిన రోడ్లపైనే మళ్లీ రోడ్లు వేస్తున్న వైనం
- రూ.కోట్ల ప్రజాధనానికి కన్నం
- చంద్రబాబు సర్కారుపై వెల్లువెత్తుతున్న విమర్శలు


శ్యాంపురంలో గతంలోని రోడ్డుపై మళ్లీ రోడ్డు వేస్తున్న దృశ్యం

కూటమి నేతలకు అందలం.. అక్రమాలకు అవకాశం!

రాజాం:

కూటమి ప్రభుత్వం.. తమ పార్టీల నేతలు, కార్యకర్తల జేబులు నింపడమే పనిగా పెట్టుకుంది. ఇస్తానన్న సంక్షేమ పథకాలు పక్కనపెట్టి టీడీపీ కాంట్రాక్టర్లకు నిధులు మళ్లిస్తోంది. గ్రామీణ ప్రాంతాల్లోని కార్యకర్తలకు సైతం ఎంఎన్‌ఆర్‌ఈజీఎస్(మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం) ద్వారా పనులు కేటాయించి, నిధులు పక్కదారి పట్టిస్తోంది. ముఖ్యంగా రాజాం నియోజకవర్గంలోని రాజాం మండలంలో ఈ నిధుల కేటాయింపులో అయినవారికి అందలం ఎక్కించేలా మంజూరు చేశారు. అవసరం లేని చోట అధికంగా పనులు చేసి, ప్రజాధనాన్ని పక్కదోవ పట్టిస్తున్నారు. దీంతో చంద్రబాబు సర్కారుపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

టీడీపీ నేతల పంచాయతీలకు అధికం..

రాజాం మండలంలో మొత్తం 21 పంచాయతీలు ఉండగా, ఎంఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులు ఎక్కువగా టీడీపీ నేతలు బలంగా ఉన్న పంచాయతీలకు అధిక మొత్తంలో కేటాయించారు. మండలంలో శ్యాంపురం పంచాయతీకి అత్యధికంగా రూ.97 లక్షలు కేటాయించడం విశేషం కాగా ఇక్కడ కేవలం 500 వరకు మాత్రమే కుటుంబాలు ఉన్నాయి. అభివృద్ధి, మౌలిక వసతుల పేరుతో నిధుల కేటాయింపు అధికంగా జరిగింది. ఇదే మండలంలో అత్యధిక జనాభా ఉన్న పంచాయతీ అయిన పొగిరికి ఇచ్చిన నిధులు మాత్రం కేవలం రూ.30 లక్షలే కావడం గమనార్హం. శ్యాంపురానికి మంజూరైన నిధులతో అయితే నిబంధనలకు విరుద్ధంగా పనులు చేపట్టారు. గతంలోని పాత సీసీ రోడ్లపైనే మళ్లీ రోడ్లు వేయడం, గతంలోని మురుగుకాలువలు ఉన్నచోటే మరమ్మతులు చేసినట్లు చూపించి, నిధులు వృథా చేస్తున్నారు.

అత్యల్పంగా వీఆర్ అగ్రహారం, నందబలగ, దోసరి గ్రామాలకు రూ.10 లక్షలు చొప్పున కేటాయించారు. మిగిలిన 17 పంచాయతీలకు రూ.12 లక్షల నుంచి 20 లక్షల మధ్య నిధులు కేటాయించారు. పొగిరి, కంచరాం వంటి పెద్ద పంచాయతీలకు సైతం మొండిచెయ్యి చూపారు.

రాజాం మండలంలో నిధుల కేటాయింపు ఇలా..

మండలంలోని పంచాయతీలు: 21

గ్రామ సచివాలయాలు: 14

కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత కేటాయించిన నిధులు..

నిధుల రకం	పనుల సంఖ్య	కేటాయించిన నిధులు(రూ.ల్లో)
ఎంఎన్‌ఆర్‌ఈజీఎస్	94	రూ.6.32 కోట్లు
జెడ్పీ	0	0
మండల పరిషత్ నిధులు	28	రూ.1.45 కోట్లు
పంచాయతీ నిధులు (15వ ఆర్థికసంఘం)	48	రూ.2 కోట్లు


శ్యాంపురం ప్రధాన ఆర్‌అండ్‌బీ రోడ్డుపై రూ.7 లక్షలతో 40 మీటర్ల సీసీ రోడ్డు

పాత పనులు చూపించి, బిల్లులు తినేశారు..

- శ్యాంపురం, పొగిరి, ఆగూరు, రాజయ్యపేటల్లో గతంలోని రోడ్లపైనే మళ్లీ రోడ్లు వేసి బిల్లులు పెట్టారు. వాటిలో కొన్నింటికి బిల్లులు కాగా, మరికొన్నింటి బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి
- పొగిరి గ్రామ శివారున అవసరం లేనిచోట రూ.6 లక్షలతో సీసీ రోడ్డు నిర్మించారు
- రాజయ్యపేటలో గతంలోని మురుగుకాలువ స్థానంలో తవ్వేసి మళ్లీ మురుగుకాలువ నిర్మించారు.

హమ్మయ్యా రోడ్లు బాగు చేశారు..


ఆర్టీసీ కాంప్లెక్స్, ఎన్ఆర్ఐ ఆస్పత్రి మధ్య బాగు చేసిన రోడ్డు


సాలూరు రూట్‌లో మరమ్మతులు చేపట్టిన రోడ్డు

సాక్షి ఎఫెక్ట్...

రామభద్రపురంలోని సాలూరు రూట్ రోడ్డుతో పాటు ఎన్ఆర్ఐ ఆస్పత్రి, ఆర్టీసీ కాంప్లెక్స్‌ల మధ్య రోడ్డును బాగుచేశారు. ఇదివరకు ఆయా రోడ్లు.. అడుగుకో గుంత.. గజానికో గొయ్యి మాదిరి చాలా అధ్వానంగా ఉండేవి. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడేవారు. ఈ నేపథ్యంలో రోడ్లు బాగులేని కారణంగా ప్రజలు పడుతున్న అవస్థలపై సాక్షి దినపత్రికలో పలుమార్లు వార్తలు ప్రచురితమయ్యాయి. స్పందించిన సంబంధిత అధికారులు ఆయా రోడ్ల మరమ్మతులు చేపట్టి, గుంతలు లేకుండా చేశారు. ఇది చూసిన వారంతా హమ్మయ్యా రోడ్లు బాగు చేశారని అనుకుంటున్నారు.

– రామభద్రపురం

రేపటి నుంచి యూటీఎఫ్ మహాసభలు

వంగర: కాకినాడలో ఈ నెల 5 నుంచి 8వ తేదీ వరకు ఏపీ యూటీఎఫ్ స్వర్ణోత్సవాల మహాసభలు నిర్వహిస్తున్నట్లు ఆ సంఘ అధ్యక్ష, కార్యదర్శులు ఎం.ప్రసాద్, పి.గౌరీశంకరరావు తెలిపారు. స్థానిక ఎమ్మార్సీలో సభలకు సంబంధించిన వాల్‌పోస్టర్లను ఎంఈవో ప్రవీణ్‌కుమార్ చేతులమీదుగా విడుదల చేయించారు. కార్యక్రమానికి అందరూ విచ్చేసి, విజయవంతం చేయాలని సంఘ నాయకులు కోరారు.

పారిశుధ్య పనులు

వంగర: మండలంలోని కొండచాకరాపల్లి గ్రామంలో పారిశుధ్య పనులు శుక్రవారం చేపట్టారు. సర్పంచ్ గొయ్యమ్మ ఆధ్వర్యంలో వీధుల్లోని డ్రైనేజీల్లో మురుగునీటిని తొలగించి, బ్లీచింగ్ చల్లారు. దోమలు పెరగకుండా చర్యలు తీసుకోవాలని, అనవసరంగా చెత్తాచెదారం కాలువల్లో వేయవద్దని సర్పంచ్ సూచించారు.

బొబ్బిలి: పట్టణంలో పారిశుధ్య చర్యలు ముమ్మరం చేయాలని మున్సిపల్ కమిషనర్ ఎల్.రామలక్ష్మి ఆదేశించారు. పాతబొబ్బిలిలో శుక్రవారం పర్యటించిన ఆమె.. పల్లెం, పల్లి, కూరాకుల, దిబ్బ వీధుల్లో నెలకొన్న అపారిశుధ్యం విషయాన్ని అక్కడి కౌన్సిలర్లు కమిషనర్ దృష్టికి తీసుకురాగా, ప్రతిరోజూ పారిశుధ్య పనులు చేపట్టాలని సిబ్బందిని ఆమె ఆదేశించారు.

నిబంధనలు బేఖాతరు!

రామభద్రపురం: మండలంలోని పలు ఆస్పత్రుల యాజమాన్యాలు నిబంధనలు బేఖాతరు చేస్తున్నాయి. ప్రైవేటు ఆస్పత్రులకు చెందిన వారో లేక ప్రభుత్వ ఆస్పత్రులకు చెందిన వారు చేసిన పనో తెలీదు గానీ అత్యంత విలువైన కాలంచెల్లిన మందులను స్థానిక పెట్రోల్ బంకు వెనక ఉన్న బూసాయవలస చెరువు ఒడ్డున గుట్టలు గుట్టలుగా పారబోశారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ప్రవేటు ఆస్పత్రులైనా, ప్రభుత్వ ఆస్పత్రులైనా కాలంచెల్లిన మందులు సహా వినియోగించిన ఇంజిక్షన్, సిలైన్లు తదితర మెడికల్ వ్యర్థాలను ఎక్కడిపడితే అక్కడ పారేయకూడదు. సేఫ్టీ పిట్‌లో వేసి బర్న్ చేయాలి. ఆస్పత్రుల వ్యర్థాల కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వేస్ట్ మేనేజ్‌మెంట్ వాహనాలకు మాత్రమే ఆ వ్యర్థాలు ఇవ్వాల్సి ఉంటుంది. అయితే ఆ వాహనాలు రావాలంటే ప్రవేటు యాజమాన్యం వారు ప్రభుత్వానికి డీడీ లేదా చలానా రూపంలో బిల్లు చెల్లించాలి. అలా అయితేనే ఆ వాహనాలు వచ్చి, వ్యర్థాలు తీసుకువెళ్తాయి. అయితే ప్రైవేటు ఆస్పత్రుల యాజమాన్యాల వారే ఇలా చేసి చేతులు దులుపుకుంటున్నారన్న ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. ఇలా ఎక్కడపడితే అక్కడ పడేసిన వ్యర్థాలు వల్ల పర్యావరణం దెబ్బతినడమే కాకుండా మేతకు వెళ్లే పశువులకు సిరంజి సూదులు గుచ్చుకుంటాయని, మనుషులకు కూడా ప్రమాదం లేకపోలేదని వైద్యాధికారులు చెబుతున్నారు.


సిలైన్ బాటిళ్ల పోగు


బూసాయవలస చెరువు ఒడ్డున పారబోసిన మాత్రలు, ఇంజిక్షన్లు, సిరప్‌లు

సంక్షిప్తంగా...

ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు

బొబ్బిలి: మండలంలోని మెట్టవలస వీఆర్వో అడపా గౌరీశంకర్‌పై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు సీఐ కె.సతీష్‌కుమార్ తెలిపారు. స్థానిక తహసీల్దారు కార్యాలయం వద్ద నగర పోలమ్మ అనే మహిళను కులం పేరిట శుక్రవారం దూషించిన కారణంగా బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేయడం జరిగిందన్నారు. సదరు కేసును డీఎస్పీ పి.శ్రీనివాసరావు దర్యాప్తు చేయనున్నట్లు పేర్కొన్నారు.

ఆటవస్తువుల అందజేత

బొబ్బిలిరూరల్: స్థానిక భవిత కార్యాలయానికి స్వచ్ఛంద సేవా సంస్థ నిర్వాహకులు వర్మ వితరణ చేసిన ప్లాస్టిక్ గుర్రం, జారుడుబల్ల వంటి ఆటవస్తువులను ఎమ్మెల్యే బేబీనాయన చేతులమీదుగా శుక్రవారం అందజేశారు. అనంతరం దివ్యాంగ చిన్నారులకు మధ్యాహ్న భోజనం సదుపాయం కల్పించాలని ఎమ్మెల్యేను నిర్వాహకులు కోరగా, అన్న క్యాంటీన్ నుంచి తెప్పించి ఇచ్చేందుకు ఎమ్మెల్యే ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీడీవో రవికుమార్, ఎంఈవోలు లక్ష్మణరావు, వాసు తదితరులు పాల్గొన్నారు.

ఈ–క్రాప్ నమోదు చేసుకోవాలి

బాడంగి: రబీ సీజన్ పంటలకు సంబంధించి, ఈ–క్రాప్ నమోదుతో పాటు క్రాప్ ఇన్సూరెన్స్ చేయించుకోవాలని ఏవో శిరీష సూచించారు. స్థానిక వ్యవసాయ కార్యాలయంలో ఈ–క్రాప్, క్రాప్ ఇన్సూరెన్స్ నమోదు, ధాన్యం కొనుగోళ్లపై శుక్రవారం సమీక్ష నిర్వహించారు. 1454 ఎకరాలకు గాను 830 ఎకరాల్లోని పంటల ఈ–క్రాప్ పూర్తయిందన్నారు. మండలంలో 10 వేల మెట్రిక్ టన్నుల లక్ష్యం కాగా ఇప్పటివరకు 8 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయడం జరిగిందని ఏవో తెలిపారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

బొబ్బిలిరూరల్: స్థానిక ఎంఈవో కార్యాలయం వద్ద ఏపీ సీఆర్‌పీఎఫ్ నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఎమ్మెల్యే బేబీ నాయన చేతులమీదుగా శుక్రవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎంపీడీవో పి.రవికుమార్, ఎంఈవోలు గొట్టాపు వాసు, లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

తాగునీరు వృథా


పైపులైన్ నుంచి వృథాగా పోతున్న నీరు

వంగర: మండలంలోని ఎం.సీతారాంపురం గ్రామంలో తాగునీరు వృథా అవుతోంది. రంగస్వామి వీధిలోని తాగునీటి పైపులైన్‌కు అయిన లీకు కారణంగా నీరు వృథాగా బయటకు పోతోంది. ఇళ్ల ముంగిట నీరు వస్తుండడంతో ఇబ్బందులు పడుతున్నామని, అధికారులు స్పందించి, తాగునీటి వృథాను అరికట్టాలని కోరుతున్నారు.

విద్యార్థులకు ఆరోగ్య తనిఖీలు

రామభద్రపురం: రాష్ట్రీయ బాలల స్వాస్థ్య కార్యక్రమంలో భాగంగా మండలంలోని పాతరేగ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు శుక్రవారం ఆరోగ్య తనిఖీలు చేపట్టారు. ఆరికతోట పీహెచ్‌సీ ఈవో మల్లికేశ్వరరావు ఆధ్వర్యంలో రక్త పరీక్షలు, ఆర్‌బీఎస్, చెస్ట్, దీర్ఘకాలిక వ్యాధులకు సంబంధించిన స్క్రీనింగ్ నిర్వహించి, అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు.

మాజీ ఎమ్మెల్యే పరామర్శ


లక్ష్మణరావును పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే శంబంగి

తెర్లాం: మండల వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు, తెర్లాం పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు నర్సుపల్లి లక్ష్మణరావును మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు పరామర్శించారు. కొన్నిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న లక్ష్మణరావు విజయనగరంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందిన అనంతరం తెర్లాంలోని స్వగృహానికి చేరుకున్నారు. ఈ విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే శంబంగి.. శుక్రవారం తెర్లాం వెళ్లి, అతడిని కలిసి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకుని, ఎప్పటిలాగే పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో తెర్లాం ఎంపీపీ ప్రతినిధి నర్సుపల్లి బాబ్జీరావు, పార్టీ మండల అధ్యక్షుడు తెంటు సత్యంనాయుడు, నందిగాం మాజీ పీఏసీఎస్ అధ్యక్షుడు గుల్లిపల్లి మృత్యుంజయరావు తదితరులు పాల్గొన్నారు.

'మత్తు'తో జీవితం చిత్తు


అవగాహన కల్పిస్తున్న సీఐ అశోక్‌కుమార్

రాజాం సిటీ: గంజాయి, ఖైనీ, గుట్కా, మద్యం, సారా, సిగరెట్ వంటి మత్తు పదార్థాలతో జీవితం నాశనం(చిత్తు) అవుతుందని, ప్రతిఒక్కరూ మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని రాజాం టౌన్ సీఐ కె.అశోక్‌కుమార్ సూచించారు. సంకల్పం కార్యక్రమంలో భాగంగా స్థానిక పట్టణ పరిధిలోని బుచ్చెంపేట ప్రజలకు మత్తు పదార్థాల వల్ల కలిగే అనర్థాలపై శుక్రవారం అవగాహన కల్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ యువత పెడదోవపట్టకుండా సన్మార్గంలో నడిపించాల్సిన బాధ్యత పెద్దలపై ఉందన్నారు. సంక్రాంతి సెలవులకు దూర ప్రయాణాలు చేసేవారు ఎల్‌హెచ్‌ఎంఎస్‌ను వినియోగించుకుని, రక్షణ పొందాలన్నారు. బంగారు ఆభరణాలు, ఇతర విలువైన వస్తువులు ఇళ్లల్లో ఉంచి, క్యాంపులు వెళ్లొద్దన్నారు. అలాగే గ్రామాల్లో గుర్తు తెలియని వ్యక్తులు సంచరిస్తే పోలీసులకు సమాచారం అందించాలన్నారు.

మహనీయురాలు సావిత్రిబాయి పూలే


తెర్లాం: పెరుమాళి ఆదర్శ పాఠశాలలో మహిళా ఉపాధ్యాయులను సన్మానించిన దృశ్యం

వాడవాడలా జాతీయ మహిళా ఉపాధ్యాయ దినోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ప్రముఖ సంఘ సేవకురాలు, దేశ తొలి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రిబాయి పూలే జయంతి సందర్భంగా ఏటా ఈ కార్యక్రమం నిర్వహిస్తుండగా, ప్రజాప్రతినిధులు, అధికారులు, ఉపాధ్యాయ సిబ్బంది అంతా సావిత్రిబాయి చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. విద్యతోనే స్త్రీ విముక్తి సాధ్యమని నమ్మి, మహిళా విద్యకు కృషి చేసిన మహనీయురాలు సావిత్రిబాయి పూలే అని వక్తలు కొనియాడారు. నేటి తరానికి ఆమె ఆదర్శమని, మహిళా అభ్యున్నతికి ఆమె చేసిన కృషిని నిత్యం స్మరించుకోవాలన్నారు. అనంతరం పలువురు మహిళా ఉపాధ్యాయినిలను సన్మానించారు.

– బొబ్బిలి, రాజాం


రేగిడి: ఉంగరాడ యూపీ పాఠశాలలో ఉపాధ్యాయినిని సత్కరిస్తున్న ఎంఈవో ప్రసాదరావు తదితరులు


వంగరలో సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాల వేసి, నివాళులర్పిస్తున్న దృశ్యం


సంతకవిటి: సిరిపురం ప్రాథమిక పాఠశాల టీచర్ సరోజినిని సన్మానిస్తున్న సిబ్బంది, విద్యార్థులు


బొబ్బిలి: నిరుపేదల మహిళలకు చీరలు పంపిణీ చేస్తున్న మహిళా మండలి డైరెక్టర్ రాధ, సోరు సాంబయ్య తదితరులు


రాజాం సిటీ: సావిత్రిబాయి పూలే చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న బీఎస్పీ నేత బుద్ధుడు తదితరులు


బొబ్బిలి: సావిత్రిబాయి పూలేకు నృత్య నీరాజనం తెలుపుతున్న బాలికలు

సన్మానం

వంగర: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యుడిగా నియమితులైన దళిత సంఘ నాయకుడు మజ్జి గణపతిని శుక్రవారం సన్మానించారు. కార్యక్రమంలో ఎంఈవో పి.ప్రవీణ్‌కుమార్, హెచ్‌ఎం ముద్దాడ రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.

సక్రమంగా అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణ

రేగిడి: అంగన్‌వాడీ కేంద్రాలను సక్రమంగా నిర్వహించాలని ఐసీడీఎస్ బూరాడ సెక్టార్ సూపర్‌వైజర్ సుజాత సూచించారు. మండలంలోని బూరాడ-1, 2 అంగన్‌వాడీ కేంద్రాలతో పాటు ఉంగరాడ మెట్ట వద్ద ఉన్న ఆదర్శ అంగన్‌వాడీ కేంద్రాలను ఆమె ఆకస్మికంగా శుక్రవారం తనిఖీ చేశారు. కేంద్రాలకు వస్తున్న చిన్నారులకు ఆటపాటలతో కూడిన విద్యనందించాలని తెలిపారు.